క్లుప్తంగా

9న ఉచిత దంత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9న ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్, పావులూరు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు 2/1 బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అద్దె భవనాల్లో ఐటీ కంపెనీల నిర్వహణ

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ఐదు వేల చదరపు అడుగులు కలిగిన భవనాలు కలిగి, ఐటీ కంపెనీలకు అద్దెకు ఇవ్వడానికి ఆసక్తి కలిగిన భవన యజమానులు ఈ నెల 10వ తేదీ నుంచి కమిషనర్ చాంబర్‌లో సంప్రదించవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం పారిశ్రామికంగా, ఐటీ పరంగా పలు సంస్థలను ఆహ్వానిస్తుందని, అందులో భాగంగా గుంటూరు జిల్లా కేంద్రంలో కార్యాలయాల కోసం ప్రత్యేకంగా భవనాలు అవసరమన్నారు. అద్దె ప్రాతిపదికన భవనాలు తీసుకోవడానికి ప్రభుత్వం నిర్ణయించిందని, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆసక్తి కల్గిన భవన యజమానులు తమ భవనానికి సంబంధించిన చిరునామా, అంతస్తుల వివరాలు, అద్దెకు ఇవ్వాలనుకున్న భవన విస్తీర్ణం, భవనం నిర్మాణం జరిగిన ఏడాది, యజమాని పేరు, ఫోన్ నంబర్, విద్యుత్, నీటి సదుపాయాల సమగ్ర వివరాలతో కమిషనర్ చాంబర్ లో సిటీ ప్లానర్ డి.రాంబాబు (9849908390), చాంబర్ సూపరింటెండెంట్ ఎస్ఎన్ ప్రసాద్(9866337509)కు అందించాలని కోరారు.

ప్లాస్టిక్ భూతంపై విద్యార్థుల పోరు



గుంటూరు ఎడ్యుకేషన్: సమాజాన్ని పట్టి పీడిస్తున్న ప్లాస్టిక్ భూతానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరుబాట పట్టారు. శుక్రవారం ఎస్వీఎన్ కాలనీలోని చిన్మయ విద్యాలయం ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్లాస్టిక్ వాడకం వలన వాటిల్లే అనర్థాలపై సమాజాన్ని చైతన్యపరుస్తూ ప్రదర్శనలు ఇచ్చారు. పాఠశాల నుంచి గుజ్జనగుండ్ల సెంటర్ వరకు ర్యాలీగా వచ్చిన విద్యార్థులు అక్కడ పాలిథిన్ కవర్లతో అడవుల్లోని జంతువులకు, నీటిలోని జలచరాలకు వాటిల్లుతున్న ముప్పును వివరిస్తూ ప్రదర్శన ఇచ్చారు. క్యారీబ్యాగులకు ప్రత్యామ్నాయంగా పేపర్‌తో తయారు చేసిన క్యారీబ్యాగులను వాడాలని సూచిస్తూ, సమీపంలోని దుకాణాలకు పేపర్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల వెంట ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన విజయ గణపతి స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: స్థానిక ఎస్వీఎన్‌కాలనీ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో నిర్వహిస్తున్న శ్రీవిజయ గణపతి స్వామి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉదయం ప్రాతఃకాల ఆరాధన, నిత్య హోమం, లక్ష్మీ సుదర్శన హోమం, పారమాత్మిక మహా శాంతి హోమం, బలిహరణ వంటి కార్యక్రమాలను వేద పండితులు వేదోక్తంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాలను తిలకించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణాలు, ఊంజల్ సేవ వైభవంగా జరగ్గా, ఆలయ అధ్యక్షుడు వట్టికూటి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/13వ అడ్డరోడ్డు ఓంకార క్షేత్రం కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత ఓంకార క్షేత్రంలో నిర్వహిస్తున్న 91వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవం, 95వ సంఘ వార్షికోత్సవాలు నాలుగో రోజుకి చేరాయి. శుక్రవారం ఉదయం గాయత్రీమాత, భువనేశ్వరి అమ్మ వార్లకు కుంకు మార్చనలు నిర్వహించారు. పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి కళ్యాణాన్ని ఆలయ అర్చకులు వేద మంత్రాల నడుమ కనుల పండువగా చేపట్టారు. కర్లపాలెం సూర్యనారాయణ బృందం భక్తి కీర్తనలను ఆలపించారు. మంచికంటి వెంకట సత్యవతి శ్రీమద్ రామాయణ ప్రవచనంలో అరణ్య కాండ రెండవ భాగంలోని విశేషాలను వివరించారు. కార్యదర్శి నంబూరు వేంకట శ్రీమన్నారాయణమూర్తి పాల్గొన్నారు.

మైనర్... రైడర్

> 'చౌత్రా సెంటర్‌కు చెందిన 15 ఏళ్ల బాలుడు, మరో ముగ్గురు స్నేహితులు కలిసి బైక్‌పై సరదాగా తిరుగుతున్నారు. చుట్టుగుంట వైపు నుంచి నల్లపాడు రోడ్డు వెళ్తుండగా ఆ బాలుడు ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా, అతడి స్నేహితుడు మాత్రం తీవ్ర గాయాలతో బయట పడ్డారు.' తరుచూ నగరంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.


ప్రాణాలంటే లెక్కేలేదు..

- నగరంలో పెరిగిపోతున్న బైక్ ప్రమాదాలు
- అధిక ప్రమదాలు మైనర్, యువకుల వలనే అనే అభిప్రాయాలు
- పోలీసు అధికారులతో పాటు తల్లిదండ్రులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది

పట్నంబజారు: ఎన్నిసార్లు చెప్పినా వినరూ... కేసులు కట్టినా పట్టించుకోరూ.. జరిమానాలు వేసినా లెక్క లేదు.. కానీ ప్రాణాల మీదుకు తెచ్చుకుంటున్నారు. ఒకటికి పలు ఘటనలు జరిగినా.. తల్లిదండ్రులు.. పాఠశాల, కళాశాల యాజమాన్యాల్లో మాత్రం మార్పు రావటం లేదు. ప్రమాదం అరికడతామన్న కనీసం ఆలోచన ముందు చేయాల్సిందే కచ్చితంగా తల్లిదండ్రులే. రోడ్డు పైకి వస్తే పోలీసులు ఫైన్ వేస్తున్నారని.. వారిని నోటికొచ్చినట్లు తిడుతున్నాం.. కానీ అనుకోని ఘటన జరిగితే.. నష్టం ఎవరికన్నది ఆలోచించటం లేదు. ఇటీవల కాలంలో మైనర్‌లు వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడటంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

దొరికితే... దక్షిణే....?

ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా మార్చి ఒకటి నుంచి జరిమానాలు ఒకటికి పదింతలు పెరగనున్నాయి. ఈ క్రమంలో దీనిని ఆసరాగా చేసుకుని ఎస్‌ఐలు, వారి అసిస్టెంట్‌లు మైనర్‌లు, యువత దొరికినప్పుడు అధిక జరిమానాలు పడతాయని, కేసులు నమోదు చేస్తారని చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారనే వాదనలు వినవస్తున్నాయి. అందుకు నిలువెత్తు నిదర్శనం... కోబాల్టుపేటలో త్రిపుల్ రైడింగ్ చేస్తూ.. మద్యం మత్తులో ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్‌అజీజ్ జీపు డ్రైవర్‌గా పనిచేస్తున్న షేక్ ఇమ్రాన్‌వలి(36) ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి అతడి మృతికి కారణమయ్యారు. వారిలో ఒక వ్యక్తిని మాత్రమే పోలీసులు అదుపులోకి తీసుకోగా, ఒక వ్యక్తి ప్రకాశం జిల్లాలో చికిత్స పొందుతుండగా, మరో వ్యక్తి ఆచూకి ఇప్పటి వరకు కనుగొలేదని తెలుస్తోంది. చాటి పోలీసు ప్రమాదంలో చనిపోతేనే పోలీసులు వ్యవహరివస్తున్న తీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల కాలంలో ఈస్ట్ అధికారి వద్ద ఉండే ఒక కానిస్టేబుల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన వాహనానికి సంబంధించి రూ.5వేలు తీసుకుని పంపించిన ఘటన కలకలం రేపింది. ఇదే క్రమంలో డ్రంక్ అండ్ నిర్వహించిన ప్రాంతాల్లో సదరు అధికారికి అసిస్టెంట్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి కొన్ని వాహనాలను పక్కన పెట్టి... జేబులు నింపుకుంటున్నాడనే ఆరోపణలు అధికంగా ఉన్నాయి.



సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న మైనర్

ట్రాక్టర్‌కు ఇన్సూరెన్స్ ఉందా..?

నల్లపాడు రోడ్డులో ప్రమాదం జరిగిన ట్రాక్టర్‌కు సంబంధించి ట్రాఫిక్ పోలీసులు ఎంతో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆ ప్రాంతంలో అనేక దుకాణాలకు సంబంధించి సీసీ పుటేజీలు ఉన్నప్పటికీ రెండు రోజుల తరువాత వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్‌కు బీమా లేదని ఆ స్టేషన్ సిబ్బందే చెప్పుకుంటున్నారు. ఇప్పుడు ప్రమాదంలో మృతి చెందిన చిన్నారులకు ఎటువంటి న్యాయం జరగదా...? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వెస్ట్ ట్రాఫిక్ స్టేషన్ అధికారులు స్పష్టమైన చర్యలు తీసుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తాం



నగరంలో మైనర్, ర్యాష్ డ్రైవింగ్‌లపై ఇప్పటికే అనేక మార్లు అవగాహన సదస్సులు నిర్వహించాం. అయినా మైనర్లు, వారి తల్లిదండ్రుల్లో మార్పు రాకపోవటం బాధాకరం. నగరంలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించేందుకు దృష్టి సారిస్తున్నాం. ముఖ్యంగా తిప్రుల్, మైనర్, ర్యాష్, స్నేక్ డ్రైవ్‌లపై దృష్టి సారించాం. కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

–ఎం.రమేష్, డీఎస్పీ, ట్రాఫిక్

సాగుతున్న బైక్ రేస్‌ల పరంపర...

నగరంలో వెస్ట్ సబ్‌డివిజన్‌లో మాత్రం బైక్ రేసుల పరంపర కొనసాగుతూనే ఉంది. సాయంత్రం ఐదు నుంచి 8 గంటల వరకు కళాశాలలు వదిలిన సమయంలో మైనర్లు, విద్యార్థులు, యువత వెళుతున్న స్పీడు.. బ్రేక్‌లు వేసే నాథుడే లేకుండా పోయాడు. ఏదో ఉన్నతాధికారుల మెప్పు కోసం అప్పుడప్పుడు హడావుడి చేసి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించటం తప్ప చేస్తోంది ఏమి లేదని ఆరోపణలు ఉన్నాయి. లక్ష్మీపురం, బ్రాడీపేట, గుజ్జనగుండ్ల, కొరిటెపాడు రోడ్డు, జేకేసీ కళాశాల, విద్యానగర్ రోడ్డుల్లో మైనర్‌లు ప్రదక్షిణలు చేస్తున్నారు. గతంలో నగరంపాలెంలోని ఐటీసీ వద్ద ఏడుగురు యువకులు ద్విచక్ర వాహనాలపై రేస్‌లు నిర్వహిస్తున్న క్రమంలో అప్పటి ట్రాఫిక్ సీఐ కె.వాసు వారిని అదుపులోకి తీసుకోవటంతో పాటు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన పరిస్థితులు ఉన్నాయి. గత ఏడాదిలో యాప్ పనిచేయటంలేదనే కారణంతో అసలు కేసుల అంశాన్నే మరిచిపోయారు. గత నాలుగు నెలల మాత్రం మైనర్‌పై కేసులు కూడా నార్మల్ కేసుల జరిమానాలు విధించి పంపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల జరిగిన ఒక సర్వేలో అధిక ప్రమాదాల్లో మరణించిన వారు మైనర్‌లు, యువకులేనని, 65 శాతం ప్రమాదాలకు కారకులుగా నిలుస్తున్నారని వెల్లడించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు



మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూ నగర్: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సోమవారానికి సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డీఈఈల వారీగా ఏఈలు, ఎమినిటి కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని, వాస్తవ అవసరాలకు తగిన విధంగా అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈలు సుందర్‌రమిరెడ్డి, కోటేశ్వరరావు, డీఈఈలు నాగభూషణం, కళ్యాణరావు, మధుసూదన్, రమేష్ బాబు, సతీష్ కుమార్, శ్రీనివాస్, ఇంజినీరింగ్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలి

ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని, మధ్యాహ్నం సమయంలో గ్యాంగ్ వర్క్‌లు తప్పనిసరిగా చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం నల్లచెరువు, సంపత్ నగర్, ఇజ్రాయిల్ పేట తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను శుక్రవారం తనిఖీ చేశారు. పర్యటనలో డీఈఈ మధుసూదన్, ఆర్ఓ సాదిక్ బాషా పాల్గొన్నారు.

నిర్దేశిత గడువు మేరకు అభివృద్ధి పనులు

నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు టెండర్ ద్వారా వర్క్ ఆర్డర్ పొందిన కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువు మేరకు పనులు పూర్తి చేయాలని, గడవు ప్రకారం చేయని పనులను రద్దు చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. శుక్రవారం కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో సంయుక్త సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈలు సుందర్‌రామిరెడ్డి, కోటేశ్వరరావు, కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొండా రమేష్, కుంచాల శివనాగేశ్వరరావు, జైరాం రెడ్డి, వెంకట్రావు, విష్ణువర్ధనరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. నగరంపాలెం పోలీస్ కవాతు మైదానంలో ఏఆర్, తూర్పు, పశ్చిమ, దక్షిణ సబ్ డివిజన్లలోని పీఎస్‌ల్లో విధులు నిర్వర్తించే సిబ్బందికి పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ క్రమశిక్షణ ప్రతి ఒక్కరికి అవసరమని అన్నారు. పోలీసు ఉద్యోగాల్లో క్రమశిక్షణ ముఖ్యమని చెప్పారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది సక్రమమైన క్రమశిక్షణ ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో క్రమశిక్షణ అలవర్చుకోవాలని చెప్పారు. జిల్లా ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, ఆర్ఐ రామకృష్ణారెడ్డి, డీఏస్పీలు అరవింద్, రమేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

ల్యాప్ టాప్, సెల్‌ఫోన్ అప్పగింత



ల్యాప్ టాప్‌ను అప్పగిస్తున్న పోలీసులు

లక్ష్మీపురం: రైలులో చోరీకి గురైన ల్యాప్ టాప్, సెల్ ఫోన్, పర్సును స్వాధీనం బాధితురాలికి జీఆర్పీ పోలీసులు అప్పగించిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు.. అమరావతి మండలం, అత్తలూరు గ్రామానికి చెందిన కొండవీటి బాలసుష్మ, వైజాగ్‌లో ఇంజినీరింగ్ చేస్తోంది. స్వగ్రామంలో శుభాకార్యం ఉండటంతో వైజాగ్ నుంచి గుంటూరు వరకు రైలు నంబర్ 17244 రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలులో స్లీపర్ క్లాస్‌లో రిజర్వేషన్ చేయించుకుని వస్తోంది. గుంటూరు స్టేషన్‌కు శుక్రవారం తెల్లవారుజామున చేరుకునే క్రమంలో యువతి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, పర్సును సీటులో పెట్టి వాష్‌రూమ్‌కు వెళ్లింది. తిరిగి వచ్చే సరికి సీటులో ఉన్న సుమారు లక్ష రూపాయలు విలువ చేసే ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, పర్సు కనిపించలేదు. దీంతో బోగిలో వెతుకలాడి తక్షణమే జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి రైలులో చోరీ జరిగినట్లుగా గుర్తించి రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలులో రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంలో వెతుకలాడటం ప్రారంభించారు. అయితే గుంటూరు రైల్వే స్టేషన్‌లోని 6,7 ప్లాట్‌ఫాం మధ్యలోని అండర్ గ్రౌండ్ మెట్ల వద్ద పోలీసులను చూసి చోరీకి పాల్పడిన వ్యక్తి పరారయ్యాడు. దీంతో బాధితురాలికి సొమ్మును అప్పగించారు. చోరీకి పాల్పడిన వ్యక్తి కోసం సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధానమివ్వాలి

డాక్టర్ కేఎల్‌పీ స్కూల్ కరస్పాండెంట్ కృష్ణప్రసాద్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న డాక్టర్ కృష్ణప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో చదువుతో పాటు క్రీడలకు ప్రాధానమివ్వాలని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని పాఠశాలలో శుక్రవారం 40వ క్రీడా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా క్రీడా పతకాన్ని ఆవిష్కరించారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ చదువు, క్రీడలకు సమ ప్రాధాన్యమివ్వాలని, ఎల్‌కేజీ, యూకేజీ దశ నుంచే విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు క్రీడా పరికరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రాథమికస్థాయి నుంచి విశాలమైన ప్రాంగణంలో సుశిక్షితులైన శిక్షకులతో విద్యార్థులకు కబడ్డీ కోర్టు, ఫుట్‌బాల్, వాలీబాల్, త్రోబాల్ కోర్టులతో పాటు అధునాతన స్కేటింగ్ ట్రాక్ ద్వారా విద్యార్థుల అభిరుచి మేరకు ఆయా క్రీడల్లో శిక్షణ కల్పిస్తున్నామని వివరించారు. మనదేశ మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలుచుకున్న సందర్భంగా వారిని స్ఫూర్తితో బాలికల జట్టు క్రికెట్ జట్టును ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జేకేసీ కళాశాల క్రికెట్ మైదానంలో బాలుర క్రికెట్ టీంతో అద్భుతమైన క్రీడను ప్రదర్శించే విధంగా తీర్చిదిద్దామని తెలిపారు. డాక్టర్ వి. రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు తమలోని ఆసక్తి మేరకు క్రీడా నైపుణ్యంలో ప్రావీణ్యులుగా ఎదగాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులు మార్చ్ ఫాస్ట్, స్కేటింగ్, కర్రసాము, మ్యూజిక్, కరాటే, డంబెల్స్, రింగ్స్ కోలాటం, యోగాసనాలు, నృత్యాలు తదితర అంశాలను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, అకడమిక్ కో–ఆర్డినేటర్ బి.శైలజ, ఏఓ కె.వెంకట్రావు పాల్గొన్నారు.

స్థిరమైన లక్ష్యంతో ఉన్నతస్థాయికి ఎదగాలి

- డాక్టర్ నాగ శ్రీహరిత
- ఘనంగా భాష్యం బ్లూమ్స్ కల్చరల్ డే



మాట్లాడుతున్న డాక్టర్ నాగ శ్రీహరిత

గుంటూరు ఎడ్యుకేషన్: ఎంచుకున్న రంగంలో నైపుణ్యాన్ని పెంపొందించుకుని స్థిరమైన లక్ష్యంతో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.నాగ శ్రీహరిత అన్నారు. శుక్రవారం రింగ్‌రోడ్డు సాయిబాబారోడ్డులోని భాష్యం బ్లూమ్స్ వీబీసీ క్యాంపస్‌లో బ్లూమ్స్ హూప్లా పేరిట కల్చరల్ డే వేడుకలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తున్న ఆధునిక సాంకేతిక యుగంలో పిల్లలు గాడ్జెట్స్‌కి బానిసలుగా మారుతున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఒక కంట కనిపెడుతూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. భాష్యం బ్లూమ్స్ పూర్వ విద్యార్థి డాక్టర్ సాయిఈశ్వర్ చౌదరి మాట్లాడుతూ భాష్యం బ్లూమ్స్‌లో విద్యనభ్యసించి తిరిగి ఆ పాఠశాలకే అతిథిగా రావడం తనకు ఎంతో మరపురాని జ్ఞాపకమన్నారు. భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా భాష్యం విద్యాసంస్థలు కృషిచేస్తున్నాయన్నారు. భాష్యం విద్యా సంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు మాట్లాడుతూ ఆధునిక విద్యా విధానాన్ని ప్రోత్సహిస్తూ నూతన బోధన పద్ధతుల ద్వారా విద్యార్థులకు అత్యుత్తమ విద్యనందించేందుకు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. సభకు భాష్యం మెడెక్స్ కళాశాల ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో భాష్యం బ్లూమ్స్ ప్రైమరీ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవిత, సెకండరీ క్యాంపస్ ప్రిన్సిపాల్ గిరిజారాణి పాల్గొన్నారు. కార్యక్రమాన్ని భాష్యం బ్లూమ్స్ జెడ్ఈఓ వరలక్ష్మి పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటెపాడు(గుంటూరు): డీ–3, డీ–10 సెక్షన్ పరిధిలోని 33 కేవీ సబ్‌స్టేషన్‌లో ఫీడర్ల మరమ్మతుల నిమిత్తం శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్–1 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షేక్ ముస్తాక్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కోత ఉంటుందని చెప్పారు.

- డీ–13 సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ పీహెచ్ హుస్సేన్ ఖాన్ తెలిపారు. నంది వెలుగు రోడ్, జియావుద్దీన్ కాలనీ, రాహుల్‌గాంధీ నగర్, వెంకటేశ్వర కాలనీ, ఆర్‌టీసీ కాలనీ, విజయవాడ రోడ్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.
- టీ–3 పరిధిలో విద్యుత్ పరికరాల మార్పు, విద్యుత్ మరమ్మత్తుల దృష్ట్యా నల్లచెరువు, సంపత్‌నగర్, ఆర్ అగ్రహారం, సంగడిగుంట, బైపాస్ రోడ్, ఏటుకూరు రోడ్, ఎన్‌హెచ్–5, ఏటుకూరు, కేవీపీ కాలనీ, కృష్ణబాబు కాలనీ, చుట్టుగుంట, చంద్రబాబునాయుడు కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతోందని టీ–3 డీఈఈ బి.రాజమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొరిటెపాడు: విద్యుత్ లైనుల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు గుంటూరు –2 విద్యుత్ శాఖ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.గురవయ్య శుక్రవారం తెలిపారు. 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడం, లైన్‌ల మెయిటెన్స్‌లో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. బ్రాడీపేట 1/14 నుంచి 6/18 లైను వరకు, లక్ష్మీపురం, చంద్రమౌళి నగర్, పండరిపురం, అశోక్ నగర్, దేవాపురం, కృష్ణ నగర్, కొబాల్ట్‌పేట, పట్టాభిపురం ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఉత్తమ ఫార్మసిస్టులుగా ఎదగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ విద్యపై ఆసక్తితో చేరిన విద్యార్థులు ఉత్తమ ఫార్మసిస్టులుగా ఎదగాలని హిందూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ నాగభూషణం తెలిపారు. శుక్రవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఫార్మా.డి కోర్సుల ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ నాగభూషణం మాట్లాడుతూ తమ కళాశాలను ఎంపిక చేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సీతారామయ్య మాట్లాడారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ ఎస్.మధుసూదనరావు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

మహిళపై దాడి

లక్ష్మీపురం: డ్వాక్రా డబ్బులు కట్టలేదని ఓ మహిళపై దాడి చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనివాసరావుపేట 5వ లైన్ ప్రాంతానికి చెందిన గొవ్వూరి విజయకుమారి అనే మహిళ గతంలో సంపత్‌నగర్‌లో నివాసం ఉండేది. ఆ సమయంలో డ్వాక్రా గ్రూప్‌లో సభ్యురాలు చేరింది. అయితే గ్రూప్‌లో డ్వాక్రా డబ్బు చెల్లించలేదని గ్రూప్ లీడర్ విజయకుమారి, సంధ్యా, మరో మహిళతో కలిసి విజయకుమారి ఇంటికి వచ్చి ఇంట్లో బలవంతంగా ప్రవేశించి చేతులతో కొట్టి గాయాలు పాలు చేశారు. బాధితురాలు దిక్కుతోచక నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మణరావుకు మద్దతు ఇవ్వండి

లక్ష్మీపురం: కృష్ణా– గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు మద్దతు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ కోరారు. బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో ప్రజాసంఘాల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ ప్రజాసంఘాలు పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు బలపరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన నామినేషన్ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ, మహిళా సంఘం జిల్లా నాయకురాలు ఎ.కళ్యాణి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో టీజేపీఎస్ ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొన్న టీజేపీఎస్ పీజీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి తెలిపారు. శుక్రవారం పట్టాభిపురంలోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అనితాదేవి మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులు ఎస్.వెంకటసాయి ప్రదీప్, బీహెచ్ రోహిత్‌కుమార్ రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచినట్లు వివరించారు. చదువుతో పాటు ప్రతిభా పాటవ పోటీల్లో పాల్గొనడం వలన విద్యార్థుల్లో చురుకుతనం, విజ్ఞానం అభివృద్ధి చెందుతాయని అన్నారు. పోటీతత్వంతో ముందుకు వెళ్లడం ద్వారా జీవితంలో త్వరగా ఉద్యోగాల్లో స్థిరపడేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ఎంబీఏ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యు.రవికుమార్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను విద్యార్థులు అధ్యయనం చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర బడ్జెట్‌ను విద్యార్థులు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని హిందూ కళాశాల విశ్రాంత ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ అబ్బరాజు రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ పీజీ కళాశాలలో కేంద్ర ఆర్థిక బడ్జెట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. శంకర కుమార్ అసోసియేట్స్ ప్రతినిధి డాక్టర్ టి.కిరణ్‌కుమార్ మాట్లాడారు. సదస్సులో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, అధ్యాపకులు డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, జి.సురేష్‌కుమార్, డాక్టర్ యు.రవికుమార్, వరలక్ష్మి, మణి, శ్రీలత, సంగీత, షెహనాజ్ పాల్గొన్నారు.


24న వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా

లక్ష్మీపురం: పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కొత్తపేటలోని మల్లయ్య లింగంభవన్‌లో శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ఈశ్వరరావు,సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు ప్రభుదాసు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు పాల్గొన్నారు.

వీఆర్‌ఓ ఉద్యోగం ఇప్పిస్తాంటూ రూ.11 లక్షల మోసం

లక్ష్మీపురం: రెవెన్యూ శాఖలో వీఆర్‌ఓ ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఓ మహిళ వద్ద రూ.11 లక్షలు తీసుకుని మోసం చేసి బెదిరింపులకు దిగుతున్న నలుగురిపై పట్టాభిపురం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. శ్యామలానగర్ ఒకటో లైన్ ప్రాంతానికి చెందిన వెంకటశిరిషా, కిరాణా షాపులో పని చేస్తోంది. భర్త అంకిరెడ్డి పాలెం కోల్డ్‌స్టోరేజీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తుంటాడు. పాలు పోసే వెంకటసాయి అనే వ్యక్తి వెంకటశిరిషాకు ఉద్యోగం ఇప్పించే వారు ఉన్నారని తాను కూడా కొంత నగదు చెల్లించి ఉన్నాని చెప్పి మల్లికార్జునపేటకు చెందిన లక్ష్మీప్రసన్నను పరిచయం చేశాడు. వెంకటశిరిషాకు రెవెన్యూ శాఖలో వీఆర్‌ఓ ఉద్యోగం ఇప్పిస్తామంటూ దానికి రూ.11 లక్షలు వరకు ఖర్చు అవుతుందని నమ్మించారు. దీంతో వెంకట శిరిషా, లక్ష్మీ ప్రసన్న మాటలు నమ్మి రూ.9 లక్షలలో కొంత లక్ష్మీప్రసన్నకు ఆమె కుమారుడు కార్తికేయకు కొంత, కుమార్తె త్రివేణికి కొంత వైజాగ్‌లో ఉండే సౌజన్యకు కొంత బ్యాంక్ ద్వారా నగదు బదిలీ చేసింది. మిగిలిన రూ.3 లక్షలు చేతికి ఇచ్చింది. నగదు తీసుకున్నప్పటి నుంచి వీఆర్‌ఓ ఉద్యోగం కోసం అడిగినప్పుడల్లా కాలయాపన చేసుకుంటూ వచ్చారు. అయితే శుక్రవారం ప్రసన్న లక్ష్మీని నిలదీయగా తిట్టి బెదిరింపులకు దిగడంతో దిక్కుతోచక బాధితురాలు పట్టాభిపురం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు లక్ష్మీ ప్రసన్న, కార్తికేయ, త్రివేణి, సౌజన్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనరంజక కవి ప్రతిభా పురస్కారాలు ప్రదానం



నగరంపాలెం: కవులను పురస్కారాలు ప్రోత్సాహిస్తాయని ఏపీ గ్రంథాలయ పరిషత్ అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై శుక్రవారం రావి రంగారావు సాహిత్య పీఠం ఆధ్వర్యంలో జన రంజక కవి ప్రతిభా పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త గద్దె మంగయ్య అధ్యక్షత వహించారు. రాజమండ్రి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, పీఠం వ్యవస్థాపకులు డాక్టర్ రావి రంగారావు మాట్లాడారు. 'నాన్న ఎందుకో వెనక బడ్డాడు' కవి ప్రకాశ్‌నాయుడు, 'అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి' కవి లేదాళ్ల రాజేశ్వరరావు, 'గాజా లేని గాజా' కవి నేలపూరి రత్నాజీలను జ్ఞాపికలతో సత్కరించి, నగదు అందించారు. 'పుష్ప మంజరి' పద్యాల సంపుటి రాసిన గుమ్మా నాగమంజరి తరఫున పురస్కారాన్ని రాజ్యలక్ష్మికి అందజేశారు. పాలక మండలి అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, పీఠం డైరెక్టర్ డాక్టర్ రావి అరుణ, డాక్టర్ మైలవరపు లలితకుమారి, గడల శివప్రసాద్, కొల్లూరి నాగేంద్రం, పీఠం కన్వీనర్ నర్రా ప్రభావతి పాల్గొన్నారు.